క్లుప్తంగా

'అమరావతి చిత్రకళ వీధి'లో కాటూరి ఆర్ట్ గ్యాలరీ



తెనాలి: రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా రాజమహేంద్రవరంలో 'అమరావతి చిత్రకళ వీధి'లో భాగంగా నిర్వహించిన చిత్ర, శిల్పకళా ప్రదర్శనలో తెనాలిలోని కాటూరి ఆర్ట్ గ్యాలరీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పర్యాటక శాఖ, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్ ఈ గ్యాలరీని సందర్శించి శిల్పకారులు కాటూరి వెంకటేశ్వరరావు, ఆయన కుమారులైన శిల్పులు కాటూరి రవిచంద్ర, శ్రీ హర్ష నుసత్కరించారు. కాటూరి శిల్పులు రూపొందించిన శిల్పాలతో కూడిన 'కాటూరి స్కల్ప ్చర్స్' బ్రోచర్ ను మంత్రి దుర్గేష్ ఆవిష్కరించారు. శిల్పకారుల సృజనను అభినందించారు. రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి చైర్‌పర్సన్ తేజస్విని పొడపాటి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ముగిసిన సదరం క్యాంప్



తెనాలిఅర్బన్: వికలాంగుల ధ్రువపత్రాలను పునః పరిశీలన జరిపే కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరం క్యాంప్ శుక్రవారంతో ముగిసింది. ఆర్థో, ఈఎన్‌టీ, సెక్రాటిక్ విభాగాలకు చెందిన వికలాంగులు వైద్యశాలకు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమాన్ని వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి పర్యవేక్షించారు.

సృజనాత్మకత వెలికితీతకు సైన్స్ ఎక్స్‌పో దోహదం



తెనాలిఅర్బన్: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ఎక్స్‌పోలు దోహదపడతాయని సెయింట్‌పాల్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్ డైరెక్టర్లు చావాలి అకుల్‌నాథ్, చావాలి తేజోనాథ్‌లు పేర్కొన్నారు. మారీసుపేట రెండుగేట్ల మధ్యలోని సెయింట్ పాల్స్ ఇంగ్లీషు మీడియంస్కూల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పోను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచే విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. తరగతి గదుల్లో నేర్చుకున్న పాఠాల ద్వారా వివిధ రకాల నమోనాలను విద్యార్థులు తయారు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ తోడేటి సలోమి దివ్యతేజ, స్కూల్ వ్యవస్థాపకులు ఎండీ చావాలి, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

6న కొలకలూరులో ఉచిత కంటి వైద్యశిబిరం

తెనాలి: స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఆహార, పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జన్మదినం సందర్భంగా ఈనెల ఆరో తేదీన రూరల్ మండల గ్రామం కొలకలూరులో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నారు. గ్రేస్ ఫౌండేషన్, ఫార్చ్యూన్ రియల్టర్స్ సహకారంతో ఆ గ్రామ బీసీ కాలనీలోని జూబ్లీ హైస్కూలు ప్రాంగణంలో ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వైద్యశిబిరం జరుగుతుందని శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మ్యాక్సీవిజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పటల్, విజయవాడ, న్యూక్లియర్ విజన్ ఆప్టికల్స్, తెనాలి వారు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, కంటి శుక్లం ఉన్నవారికి ఉచితంగా శస్త్రచికిత్స చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని కొలకలూరు, సమీప గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహక సంస్థల అధిపతులు కన్నెగంటి మురళీకృష్ణ, కై తేపల్లి షాలేమ్‌రాజా, న్యాయవాది సుద్దపల్లి మురళీధర్ కోరారు.

వీఆర్‌ఏల సదస్సు జయప్రదం చేయండి

ఫిరంగిపురం: వీఆర్‌ఏల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని వీఆర్‌ఏల మండల గౌరవాధ్యక్షుడు షేక్.మస్తాన్‌వలి, మండల ప్రధాన కార్యదర్శి షేక్.కరిముున్నీసాలు కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం వారు మాట్లాడుతూ రెవెన్యూ సహాయకుల రాష్ట్ర సదస్సు శనివారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తారన్నారు. అధిక సంఖ్యలో వీఆర్‌ఏల సదస్సులో పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు. ఇప్పటివరకు ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయిస్తున్నారని, జీతాలు పెంచడంలేదని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ తరహాలో పేస్కేలు అమలు చేసి, వీఆర్‌ఏలకు డీఏ ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. అంతేకాక ఖాళీగా ఉన్న వీఆర్వో, నైట్‌వాచ్‌మెన్, అటెండర్ ఇతర పోస్టులను అర్హులైన వీఆర్‌ఏలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అన్నీ అనధికార ఫ్లెక్సీలే

- ప్రభుత్వ స్థలాల్లోనూ వెల్లువ
- తొలగించడానికి బాధ్యులకు బద్ధకం
- ప్రకటనల పన్ను వసూలుపైనా నిర్లక్ష్యం
- పంచాయతీల ఆదాయానికి గండి



దావులూరు అడ్డ రోడ్డు వద్ద రోడ్లవెంట ఉన్న వ్యాపార ఫ్లెక్సీలు

కొల్లిపర: గతంలో నగరాలలో, పట్టణ ప్రాంతాలకే పరిమితమైన ప్రచారబోర్డులు , హోర్డింగ్‌లు క్రమేపీ గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాయి. వ్యాపార సంస్థలు తక్కువ ఖర్చుతో తమ ఉత్పత్తులను ప్రచారం చేసేందుకు గ్రామాణ రహదారుల వెంబడి ప్రజలను ఆకర్షించేలా హోర్డింగులను ఏర్పాటుచేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు, విద్యుత్ స్తంభాలకు అనధికార ఫ్లెక్సీలు హోరెత్తుతున్నాయి. వీటిపై ప్రజలు ఫిర్యాదు చేసినా, సంబంధిత గ్రామ పంచాయతీలు దృష్టి సారించటం లేదు. కనీసం నిబంధనల ప్రకారం ప్రకటనల పన్ను వసూలుచేసినా పంచాయతీలకు ఆదాయం సమకూరుతుంది.

స్థానిక సంస్థల్లో ప్రచార ఫ్లెక్సీలు, వాల్‌బోర్డులు, హోర్డింగులు ఏర్పాటు చేయాలంటే పంచాయతీలు /మున్సిపాలిటీల అనుమతి తప్పనిసరి. ఆయా సంస్థల పరిధిలోనివారు లిఖితపూర్వంగా దరఖాస్తు చేసి, అనుమతి తీసుకున్నాక, ప్రకటనల వాల్‌బోర్డులు, హోర్డింగులు ఏర్పాటుచేసుకోవాలి. అక్కడి నివాసగృహాల ప్రజలకు, ఇతర ప్రకటనదారులకు ఎలాంటి అభ్యంతరం లేకుండా ఉంటేనే అనుమతిని ఇస్తారు. కొల్లిపర మండలంలో పంచాయతీల అనుమతులను కనీసం దరఖాస్తు చేయటం లేదనేది వాస్తవం. ఎక్కడబడితే అక్కడ ఇష్టారాజ్యంగా వాల్‌బోర్డులు, ఫ్లెక్సీలు, హోర్డింగులు వెలుస్తున్నాయి.

ప్రధానంగా కొల్లిపర మండలంలో వల్లభాపురం, మున్నంగి, అత్తోట,కొల్లిపర, దావులూరు(అడ్డరోడ్డు), తూములూరుతో పాటు ఇతర గ్రామాల్లో అధికంగా ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. ఇంత భారీ సంఖ్యలో ఫ్లెక్సీలు, ప్రకటన బోర్డులు ఉన్నా వాటి నుంచి పన్నులు వసూలు చేయడంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

మండలంలో వివిధ గ్రామాలల్లో నిబంధనలకు విరుద్ధంగా రోడ్ల వెంబడి ప్రధాన కూడళ్లలోనూ, విద్యుత్ స్తంభాలకు ఫ్లెక్సీలు, హోర్డింగులు, ప్రకటన బోర్డులు అమర్చుతున్నారు. ప్రచార బోర్డుల సైజుల ఆధారంగా పంచాయతీలకు పన్ను చెల్లించాల్సి ఉంది. వీటిని ఏర్పాటు చేసే స్థలం కూడా పంచాయతీలో నమోదై ఉండాలి. కానీ ఎక్కడా ఇవి అమలు కావడం లేదు. దావులూరు అడ్డరోడ్డు వద్ద రోడ్డు అడ్డంగా గ్రామానికి ముఖద్వారం మాదిరిగా పెద్ద ఎత్తున ఫ్లెక్సీ ఏర్పాటు చేసి నెలలు తరబడి అలాగే ఉంచేస్తున్నారు.



నెలలు తరబడి ఉంచిన పార్టీల ఫ్లెక్సీలు

ప్రతి పంచాయతీ పరిధిలో కళ్ల ముందే ఫ్లెక్సీల రూపంలో ఆదాయం కనిపిస్తున్నా అధికారులు బద్ధకం వీడటం లేదు. గ్రామంలో పేద ప్రజలు పంచాయతీకి ఏమైనా పన్నులు కట్టాలి అంటే అధికారులు ముక్కు పిండి వసూలు చేస్తూ ఉంటారు. కానీ పంచాయతీల్లో వెలిసే ప్రచార హోర్డింగులు, ఫ్లెక్సీల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకునే అవకాశం ఉన్నా వాటివైపు ఎవరూ కన్నెత్తి చూడడం లేదు. వీటి వసూళ్లలో గ్రామ, మండల స్థాయి అధికారుల నిర్లక్ష్యానికి ఫలితంగా ఎక్కడబడితే అక్కడ నిబంధనలకు విరుద్ధంగా ప్రచార హోర్డింగులు, ఫ్లెక్సీలు, వ్యాపార ప్రకటనల బోర్డులు వెలుస్తున్నాయి.

అనధికార ఫ్లెక్సీలు తొలగిస్తాం

అనధికార ఫ్లెక్సీలను తొలగించమని పంచాయతీల కార్యదర్శులకు ఇంతకుముందే చెప్పటం జరిగింది. అలాగే వాల్‌బోర్డులు, హోర్డింగులకు నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకోవటం, చట్ట ప్రకారం పన్నుల వసూలుకు చర్యలు తీసుకోమని కూడా ఆదేశించాం. దీనిపై మరోసారి సమీక్షించి తగిన చర్యలు తీసుకుంటాం.

– కోట స్వరూపరాణి, డివిజనల్ పంచాయతి అధికారిణి

పంచాయతీల ఆదాయానికి గండి

పట్టణం, గ్రామాలు అనే తేడా లేకుండా ఏ ప్రాంతంలోనైనా ప్రచార బోర్డులు(ఫ్లెక్సీలు) వారి అవసరాలకు మేర ఏర్పాటు చేసిన తరువాత వారు ఏ ఉద్దేశంతో పెట్టినారు ఆ పని అయిన తరువాత వెంటనే ఏర్పాటు చేసిన వ్యక్తి వాటిని తొలగించాలి. అలా తొలగించని వాటికి చదరపు మీటరు లెక్కన పన్ను వసూలు చేయాల్సి ఉంది. ఇలా చేయడం వల్ల పంచాయతీలకు ఏటా వేలాది రూపాయలు ఆదాయం వస్తుంది. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా మండల పరిషత్ అధికారులు, పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పంచాయతీలకు వీటి ద్వారా రాబడి వచ్చే అవకాశం ఉంటుంది.

దేశ ఆర్థిక వ్యవస్థ నిర్వీర్యం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్



శివాజీచౌక్‌లో ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

తెనాలిఅర్బన్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తరువాత దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం చేసిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ ఆరోపించారు. ప్రధాని మోదీ ఆర్థిక విధానాలను ఎండగట్టేందుకు సీపీఐ ఆధ్వర్యంలో తెనాలిలో శుక్రవారం గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయం నుంచి శివాజీచౌక్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ కొద్దిసేపు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతోన్మాద శక్తులతో పాటు కార్పొరేట్ సంస్థలకు దాసోహం అన్నట్లు ప్రధాని మోదీ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కేంద్రంలోని ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రజాగ్రహానికి గురవుతున్నారని తెలిపారు. భారతదేశం నానాటికి అప్పుల్లో కుర్కుపోతుందని ఎద్దేవా చేశారు. వక్ఫ్ బోర్డు బిల్లును కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించడాన్ని తప్పుబట్టారు. ఈ బిల్లు వల్ల ఎన్నో నష్టాలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపు ఎక్కువగా ఉందని, దీనిని నియంత్రించాలని డిమాండ్ చేశారు. తెనాలి నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి వారికి అన్యాయం చేస్తుందని ఆరోపించారు. రైతులు ఉద్యమాలు చేస్తున్న కేంద్రం కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాలందరూ ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ప్రభుత్వాలపై తిరగబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ, మండల కార్యదర్శి మద్దినేని కిరణ్‌బాబు, తుంగ బాలస్వామి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మేడ హనుమంతరావు, ఎ.అరుణకుమార్, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు పాశం వెంకటేష్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దుండు శివ, యశ్వంత్, సీపీఐ సీనియర్ నాయకులు బొల్లిముంత కృష్ణ, పరుచూరి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడండి



తెనాలిఅర్బన్: రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు సూచించారు. ఓవర్ బ్రిడ్జి ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను శుక్రవారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఓవర్ బ్రిడ్జిపై నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో తెల్లవారుజాము సమయంలోనే రోడ్డును ఊడ్చి శుభ్రం చేయాలని సూచించారు. రహదారులను ఊడ్చే సమయంలో కార్మికులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, పలువురు సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

నిబంధనలకు అనుగుణంగా ప్లాన్లకు అనుమతి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన సెల్ఫ్ సర్టిఫికెట్ స్కీం–2025కు అనుగుణంగా ప్లాన్‌లు మంజూరు చేయడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో శుక్రవారం సాయంత్రం పట్టణ పరిధిలోని లైసెన్స్‌డ్ సర్వేయర్లు, ఇంజనీర్లతో సమావేశంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విధానంపై భవన నిర్మాణ యాజమానులకు అవగాహన కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అప్లికేషన్లను పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఏసీపీలు శివన్నారాయణ, వి.వాణి, టీపీవో సాంబశివరావు, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

సందేశాత్మక చిత్రాలను ప్రేక్షకులు ఆదరించాలి

దర్శకుడు రత్నాకర్ కనపర్తి



కరపత్రాన్ని ఆవిష్కరించిన రత్నాకర్

తెనాలి: సందేశాత్మక చిత్రాలను ప్రేక్షకులు ఆదరించాలని సినీ దర్శకుడు కనపర్తి రత్నాకర్ సూచించారు. ప్రముఖ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే సినిమా ఈనెల 10న తెనాలిలో విడుదల సందర్భంగా శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. చిత్ర విశేషాలను విలేకరులకు చిత్రంలో నటించిన కళాకారులు వివరించారు. తెనాలికి చెందిన ఔత్సాహిక నటీనటులు, కళాకారులు ఈ సినిమాలో 20 మందికి పైగా నటించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రత్నాకర్ మాట్లాడుతూ, మహోన్నతుల చరిత్రను భావితరాలకు చాటి చెప్పేందుకు సినిమా మాధ్యమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మహిళా విద్య కోసం, వితంతు పునర్వివాహాలకోసం, సమసమాజ స్థాపన కోసం జ్యోతిరావుపూలే పాటుపడ్డారని గుర్తుచేశారు. ఇలాంటి మహనీయుల చరిత్రను వెండి తెర చిత్రంగా మలచిన దర్శక, నిర్మాతలకు, చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. రానున్న ఫిల్మ్ ఫెస్టివల్స్ లో జ్యోతి రావు పూలే సినిమా ప్రదర్శనకోసం తనవంతుగా కృషి చేస్తానన్నారు. పెద్దీటి యోహాను, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, బెల్లంకొండ వెంకట్ పాల్గొన్నారు.

తడిసిన పసుపు పంట



దుగ్గిరాల: అకాల వర్షం వల్ల జొన్న, పసుపు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది, దుగ్గిరాల మండలంలో పలు గ్రామాలలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి పంట నష్టం వాటిల్లింది. వారం క్రితం పలుచోట్ల జొన్న పంటను కోత కోశారు. జొన్న తడవటం వల్ల మొలకెత్తెడం, రంగు మారి ద్వారా తక్కువ ధర పలుకుతాయని, బరువు కూడా తక్కువ వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు

చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



కాల్వ పూడికతీత పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కౌన్సిలర్ అరుణ

తెనాలిఅర్బన్: పట్టణంలో మురుగు సమస్యలను పరిష్కారించడానికి చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. చెంచుపేటలో శుక్రవారం జరుగుతున్న మురుగుకాల్వల పూడికతీత పనులను ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని అన్ని ప్రధాన మురుగు, పంట కాల్వల పూడికతీత పనులు చేస్తున్నట్లు చెప్పారు. వేసవి కాలం ముగిసేలోపు కాల్వల్లో పారుదల జరిగే విధంగా చూస్తామన్నారు. కార్యక్రమంలో 27వ వార్డు కౌన్సిలర్ బోయపాటి అరుణ, ఆరోగ్యశాఖాకారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, టీపీవో సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, పలువురు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

ఎన్‌ఎస్‌ఎస్ ఇన్‌ఛార్జి సువర్ణలత



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

తెనాలిటౌన్: ఇంటితో పాటు గ్రామంలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కొలకలూరు గ్రామస్తులకు ఎన్‌ఎస్‌ఎస్ ఇన్‌ఛార్జి సువర్ణలత పిలుపునిచ్చారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం బాపట్ల వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ ఏర్పాటు చేశారు. వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.ఉషారాణి, శాస్త్రవేత డాక్టర్ టి.వెంకటరాములు, ప్రొఫెసర్ టి.సంధ్యారాణి, ఎన్‌ఎస్‌ఎస్ ఇన్‌ఛార్జి డాక్టర్ ఏజె సువర్ణలత పాల్గొని గ్రామస్తులకు ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత వంటి విషయాలపై అవగాహన కల్పించారు. బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు ఆధునీక వ్యవసాయంపై అవగాహన కల్పించడమేగాక గ్రామస్తులకు విద్యా, వైద్యం, ఆరోగ్యం వంటి విషయాలపై అవగాహన పెంపొందిచడాన్ని అభినందించారు. కార్యక్రమంలో జడ్పీహైస్కూల్ హెచ్‌ఎం మాచర్ల నాగేశ్వరరావు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య మద్యం దుకాణంపై ఆందోళన



మద్యం దుకాణం ఎదుట బైఠాయించి ఆందోళన చేస్తున్న మహిళలు, స్థానికులు

తెనాలిరూరల్: ఇళ్ల మధ్యలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం కారణంగా ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే ఇక్కడి నుంచి దుకాణాన్ని తొలగించాలని మహిళలు డిమాండ్ చేశారు. రోడ్డు మీదే మద్యం తాగుతున్న మందుబాబుల వల్ల ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక నందులపేట ఘంటా వారి వీధి మూతబావి సెంటరు వద్ద కూటమి ప్రభుత్వ హయాంలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ ప్రతి రోజు మందుబాబు మద్యం కొనుగోలు చేసి రోడ్డు వెంబడి తాగుతున్నారు. అంతేకాక ఇళ్లలోకి వెళ్లి నీళ్ల పట్టుకుంటున్నారు. దీంతో స్థానిక మహిళలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఇళ్ల మధ్య మద్యం దుకాణాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తూ దుకాణం ఎదుట శుక్రవారం బైఠాయించారు. మందుబాబుల ఆగడాల కారణంగా ఇళ్ల నుండి బయటకు రాలేకపోతున్నామని వెంటనే దుకాణాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. తమ ఇబ్బందులను తెలియజేస్తూ ఎక్కసైజ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. బహిరంగంగా మద్యం తాగకుండా చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమిచారు. మహిళలతో పాటు ఆందోళనలో గుర్రం సీతారామయ్య, అక్కల శ్రీరామ్, తునుగుంట్ల శివ, మండేపూడి శేషగిరిరావు, చెన్నంశెట్టి వెంకటేశ్వర్లు, పోతురెడ్డి నాగరాజు, నీలి అజయ్ కుమార్, బయ్యా నాగ శ్రీనివాసరావు, పోతురెడ్డి త్రినాథ్, బోర్లగడ్డ ఫణికుమార్, పారుపల్లి గణేష్, చెన్నంశెట్టి రామ్మోహన్‌రావు, డక్కు సురేంద్ర, కుంభకోణం శ్రీనివాస్, పాదర్తి సతీష్, రేడితి హరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా సీనియర్స్ విభాగ ఎడ్ల బల ప్రదర్శన



జూనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతి పొందిన ఎడ్ల జత

తెనాలిరూరల్: స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో జరుగుతున్న ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన, పశు పాల ప్రదర్శన పోటీలు చివరి రోజు జోరుగా సాగాయి. గత నెల 29 నుంచి జరుగుతున్న పోటీల్లో చివరి రోజైన శుక్రవారం సీనియర్స్ విభాగం పోటీలు నిర్వహించగా, 11 జతల ఎడ్లు పోటీ పడ్డాయి. ఈ విభాగ పోటీలను తిలకించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. గురువారం రాత్రి పొద్దుపోయే వరకు జరిగిన జూనియర్స్ విభాగ పోటీల్లో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన అత్తోట శిరీషచౌదరి, శివకృష్ణ చౌదరిల ఎడ్ల జత నిర్ణీత సమయంలో 3582 అడుగులు లాగి ప్రథమ బహుమతిని పొందాయి. హైదరాబాద్‌కు చెందిన డి. రోహన్ బాబు ఎడ్ల జత (3307.07 అడుగులు) రెండో బహుమతిని, గుంటూరుకు చెందిన సోమిశెట్టి ఆంజనేయులు ఎడ్ల జత(3033.01 అడుగులు) మూడో బహుమతిని సాధించాయి. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, పారిశ్రామికవేత్త ముళ్లపూడి నరేంద్రనాథ్, 1875లో బ్రెజిల్ దేశానికి ఒంగోలు జాతి గిత్తలను తీసుకెళ్లిన కుటుంబ వారసుడు మార్సెల్లో అతిథులుగా హాజరయ్యారు. జూనియర్స్ విభాగంలో విజేతలకు బహుమతులను అందజేశారు.ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, పోటీల కన్వీనర్ నక్కా ఆనందబాబు పర్యవేక్షించారు. సూరపనేని రాధాకృష్ణమూర్తి రిఫరీగా వ్యవహరించారు. సీనియర్స్ విభాగం పోటీలు శుక్రవారం రాత్రి పొద్దుపోయే వరకు జరిగాయి.

రైలులో ప్రయాణిస్తూ... యువకుడు మృతి



యువకుడి మృతదేహం

తెనాలిరూరల్: రైలులో ప్రయాణిస్తున్న యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుమారు 23 నుండి 25 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని యువకుడు రప్తిసాగర్ ఎక్స్‌ప్రెస్‌లో కోయంబత్తూర్ నుంచి ఉత్తర్ ప్రదేశ్‌కు వెళుతున్నాడు. రైలు శుక్రవారం బాపట్ల దాటగానే యువకుడు ఉలుకు లేకుండా పడి ఉండడంతో గమనించిన తోటి ప్రయాణికులు టీసీకి సమాచారమివ్వడంతో ఆయన అధికారులకు సమాచారమిచ్చి తెనాలిలో రైలును ఆపి యువకుడిని కిందు దింపారు. రైల్వే వైద్యురాలు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్టు ధృవీకరించారు. మృతదేహాన్ని జీఆర్పీ పోలీసులు తెనాలి జిల్లా వైద్యశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నపాటి వర్షానికే రోడ్లు జలమయం



బాప్టిస్ట్‌పేటలో జలమయమైన రోడ్డు

మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. ఒకపక్క భానుడు భగభగమనడంతో ఈ వర్షానికి ప్రజలు కొంత ఉపశమనం పొందారు. అయితే మంగళగిరి నగరంలో వివిధ ప్రాంతాల్లో చిన్నపాటి వర్షానికే రోడ్లమీద నీరు నిలిచి, రాకపోకలకు అంతరాయం కలిగింది. 15వ వార్డు బాప్టిస్టు పేటలో డ్రెయినేజీ నీరు బయటకు రావడంతో ఆ వీధి మొత్తం నీటితో మునిగిపోయింది. ఎప్పుడు వర్షం పడినా ఇక్కడ ఈ రోడ్డు అంతా మురికిమయం అవుతుందని స్థానికులు చెబుతున్నారు. నగర పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలువలు ఎత్తు లేకపోవడం, పూడికలు తొలగించకపోవడంతో ఏపాటి చిన్న వర్షం వచ్చినా ప్రధాన రహదారిపై పడే వర్షపు నీరు కాలువలోకి ప్రవహించేందుకు అవకాశం లేకుండా పోయింది.

వేలం ప్రకటన

మహారాజశ్రీ తెనాలి అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో

E.P.95/2019 in O.S.94/2016

Between -

[illegible]

ఆస్తి వివరము — డి.హెచ్.ఆర్ వేలమునకు తెప్పుచున్న ఆస్తి వివరము

[illegible]

కోగంటి శివశంకరరావు, డి.హెచ్.ఆర్. తరుపు అడ్వకేటు. ఫోన్ : 9701997724

ప్రదేశం : తెనాలి. తేది : 04-04-2025

ఆళ్ళ పీరారెడ్డి, మున్నంగి, ఫోన్ నెం : 8888141418, 9492816521

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

90102 23706 (తెనాలి, వేమూరు, రేపల్లె)

99122 25447 (తెనాలి)

Office mail : sakshigntadvt@gmail.com